క్లుప్తంగా

సేంద్రియ ఎరువులతో మామిడిలో అధిక దిగుబడి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త చక్రధర్

పుత్తూరు రూరల్: మామిడి తోటలకు సేంద్రియ ఎరువులు వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ చక్రధర్ తెలిపారు. బుధవారం పుత్తూరు మండలం కేబీఆర్‌పురంలో గ్రోమోర్ ఎరువుల కంపెనీ ఆధ్వర్యంలో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చక్రధర్ మాట్లాడుతూ నల్లమచ్చ కారణంగా మామిడి కాయల్లో నాణ్యత లోపిస్తుందని తెలిపారు. రసాయన మందులు మోతాదుకు మించి వినియోగించడం ద్వారా పంట దెబ్బతినే పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. ఈఏడు పంట దిగుబడి చివరి అంకంలో ఉందని, ఇప్పటికే కోతలు పూర్తి చేసిన రైతులు తోటల్లో సేంద్రియ ఎరువులతో చెట్లను బలోపేతం చేసుకోవాలని సూచించారు. పూతదశ, పిందె, కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంట నాణ్యతగా ఉంటే ఓపెన్ మార్కెట్‌లోనే మంచి ధరలకు విక్రయించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిలో భద్రతా చర్యలు చేపట్టండి

- హైవే 205ని ఫోర్‌లేన్ రోడ్డుగా మార్చాలి
- రాష్ట్ర టోల్‌ప్లాజాల నిర్వహణ రాష్ట్ర జాతీయ రహదారుల విభాగానికి అప్పగించాలి
- కేంద్రమంత్రికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కేరోజా వినతి



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి సమస్యలను వివరిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : జాతీయ రహదారిలో భద్రతా పనులు చేపట్టాల్సి ఉందని కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనసర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా వినతిపత్రం సమర్పించారు. బుధవారం తిరుమలకు విచ్చేసిన నితిన్ గడ్కరీని కలిసిన ఆమె జాతీయరహదారుల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, భద్రతా చర్యలపై వినతిపత్రం సమర్పించారు. తొలుత నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారి 205లో పెండింగ్ పనులు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినందుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆమె పలు అంశాలపై వినతిపత్రం ఇచ్చారు.

అందులోని ప్రధాన అంశాలు..

- జాతీయ రహదారులు, భూగర్భ మార్గాలు, ఓవర్ బ్రిడ్జిలు, తగినంత వెలుతురుతో డివైడర్లు ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతపత్రంలో పేర్కొన్నారు. తిరుపతి–తిరుత్తణి–చెన్నై జాతీయ రహదారి 205ని మెరుగుపరిస్తే ప్రమాదాలు నివారించి సురక్షిత ప్రయాణం చేయడానికి అవకాశం ఉంటుంది. యాత్రికులు ఎక్కువగా వస్తున్నందున హైవే 205 పుత్తూరు నుంచి తిరుత్తణికి టులైన్ రోడ్డు మాత్రమే ఉంది. తిరుమలకు వచ్చే భక్తులు ఎక్కువగా ఈ మార్గంలో ప్రయాణిస్తున్నారు. రోడ్డు రద్దీగా ఉన్న కారణంగా ప్రమాదాలు జరిగి పలువురు మృతిచెందుతున్నందున ఈ రోడ్డును ఫోర్‌లేన్‌గా మార్చాలి.
- ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున రామానుజపల్లి జంక్షన్ వద్ద, చిగురువాడ క్రాస్ వద్ద, తిరుపతి క్రాస్ వద్ద అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలి.
- జాతీయ రహదారి 205 కల్లూరు నుంచి రేణిగుంట జంక్షన్ వరకు 4 లేన్ల రోడ్డు మాత్రమే వేస్తున్నారని, దాన్ని 6 లేన్ల రోడ్డుగా ఏర్పాటుచేస్తే జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న మార్గాలకు ప్రయాణం అవాంతరాలు లేకుండా సాఫీగా సాగుతుంది.
- జాతీయ రహదారి 205లో ప్లానిటేషన్ లేదు. తగినన్ని బటర్‌ఫ్లై లైట్లు లేవు. జిగ్–జాగ్ మార్కింగ్, ఇతర ప్రమాద హెచ్చరిక సూచికలు లేవు. ఇవి అతిముఖ్యమైనవి గనుక వీటిని త్వరగా పూర్తిచేయాలి.
- చిత్తూరు–మల్లాపురం హైవేలో చేపట్టిన విధంగా రేణిగుంట–నాయుడుపేట మార్గంలో సర్వీసు రోడ్లు ఏర్పాటుచేయాలి. ఈ మార్గం రెండు ఆధ్యాత్మిక ప్రదేశాలైన తిరుపతి, శ్రీకాళహస్తి ఉన్నందున యాత్రికుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ప్రమాదాలు జరగకుండా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలి.
- నగరి నియోజకవర్గానికి చెందిన జాతీయ రహదారుల నిర్వహణ, నియంత్రణ తమిళనాడుకు చెందిన కార్యాలయాల నుంచి జరుగుతోంది. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే స్థానికంగా ఉన్నవారికి అధికారులను సంప్రదించడం కష్టతరమవుతోంది. ఇప్పటికే ఇలాంటి సంఘటనలు చాలా జరిగాయి. వీటిని తమిళనాడు జాతీయ రహదారుల అధికారుల దృష్టికి తీసుకువెళ్లాము. గనుక రాష్ట్రంలో పనిచేస్తున్న అన్ని టోల్ ప్లాజాల నిర్వహణ ఆంధ్రరాష్ట్ర జాతీయ రహదారుల విభాగం పరిపాలనా నియంత్రణ పరిధిలోకి వచ్చేలా చేయాలి.

సీఆర్టీల జాబ్‌చార్ట్ పేరు మార్పు

చిత్తూరు కలెక్టరేట్: విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖ పరిధిలో సీఆర్టీల జాబ్‌చార్ట్, పేరును మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వులను కలెక్టర్, డీఈవో, సమగ్రశిక్ష శాఖ ఏపీసీలకు ప్రభుత్వం పంపింది. ఆ ఉత్తర్వుల మేరకు సీఆర్‌పీల పేరును క్లస్టర్ మొబైల్ రిజర్వ్ టీచర్‌గా మార్పు చేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏకోపాధ్యాయ ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల్లో పనిచేసే టీచర్లు సెలవులో ఉన్నప్పుడు సీఎంఆర్‌టీలు ప్రత్యామ్నాయ టీచర్లుగా విధులు నిర్వహించనున్నారు. జాబ్‌చార్ట్ వివరాలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,420

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73.00

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



శంకర్రాయలపేటలో సూచనలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, పక్కన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పెద్దపంజాణి: మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ మండలంలో విస్తృతంగా పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులతో కలసి శంకర్రాయలపేట సచివాలయాన్ని తనిఖీ చేశారు. అప్పినపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. టెస్ట్ కాంపోనెంట్ పనులను వేగవంతం చేయాలన్నారు. బసవరాజుకండ్రిగ సమీపంలోని జగనన్న హౌసింగ్ లేఔట్లను తనిఖీ చేశారు. లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టకపోతే పట్టాలు రద్దు అవుతాయని, త్వరలో పనులను ప్రారంభించి పూర్తి చేయాలని తెలిపారు. చివరగా రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి సిబ్బంది, ఫార్మసీ, ల్యాబ్ సదుపాయాలపై ఆరా తీశారు. ఆస్పత్రి ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. బోరు మోటరు మరమ్మతులు చేపట్టాలని ఎంపీడీఓ భాస్కర్‌ను ఆదేశించారు. ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి, స్థానిక సర్పంచ్ హరినాథ్, తహసీల్దార్ లోకేశ్వరరావు, ఎంపీడీఓ భాస్కర్ పాల్గొన్నారు.

ఇలాగేనా పరిశుద్ధ్య నిర్వహణ..?

పుంగనూరు: మండలంలోని గూడూరుపల్లె జెడ్పీ హైస్కూల్‌లో పారిశుద్ధ్య నిర్వహణపై కలెక్టర్ షణ్మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టర్ గూడూరుపల్లె హైస్కూల్, కపాడంమిట్టపల్లె సచివాలయం, జగనన్న కాలనీ నిర్మాణాలను ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్‌తో కలసి పరిశీలించారు. పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని హెచ్‌ఎం మహేష్ నారాయణపై మండిపడ్డారు. శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.



పాల ఉత్పత్తిలో ప్రథమస్థానం

చిత్తూరు అగ్రికల్చర్: పాల ఉత్పత్తిలో జిల్లాకు గత వైభవాన్ని తీసుకువచ్చి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ తెలిపారు. బుధవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో స్థానిక మ్యాంగో భవనంలో జరిగిన పశుగ్రాస వారోత్సవాల కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పాడి పశుపోషణకు రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పాల ఉత్పత్తిలో నాణ్యతకు చెప్పుకోదగ్గ గుర్తింపు ఉందని తెలిపారు. పాల ఉత్పత్తిలో గత వైభవాన్ని తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే విజయా డెయిరీ నిర్వహణను అమూల్ సంస్థకు అప్పగించినట్లు తెలిపారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో మంచి దాణా అందించేందుకు అవసరమైన మెలకువలను పశుగ్రాస వారోత్సవాల్లో పాడి రైతులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఎక్కువ పోషకాలు ఉండే పచ్చగడ్డి పెంపకం చేపట్టి పశువులకు దాణాగా అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెరిగి రైతుకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు.

14 వరకు పశుగ్రాస వారోత్సవాలు

పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ పశుగ్రాసం పెంపకంపై ఆవశ్యకత, అవగాహన కోసం ఈనెల 7నుంచి జరుగుతున్న పశుగ్రాస వారోత్సవాలకు మంచి స్పందన లభిస్తోందని, ఈనెల 14 వరకు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో గడ్డి విత్తనాలు, టీఎంఆర్, గడ్డి కత్తిరించే యంత్రాలను ఆర్బీకేల ద్వారా రాయితీపై పాడి రైతులకు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ సంతోష్ కుమార్, ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ గంగరాజు, పలమనేరు రీసెర్చ్ స్టేషన్ సైంటిస్ట్ డాక్టర్ అరుణ, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణహత్య

- బంగారు చైను, గాజుల అపహరణ
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన అడిషనల్ ఏఎస్పీ శ్రీలక్ష్మి, డీఎస్పీ



అనసూయమ్మ(ఫైల్)



గ్రామస్తులను విచారణ చేస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐ సుధాకర్ రెడ్డి

తవణంపల్లె: ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిని గుర్తు తెలియని దుండగులు కత్తితో విచక్షణారహితంగా గొంతు కోసి హత్య చేసి పరారైన సంఘటన బుధవారం మండలంలోని ఎగువ మారేడుపల్లెలో చోటు చేసుకుంది. గ్రామస్తుల సమాచారం మేరకు చిత్తూరు అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐ సుధాకర్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్య ఘటనపై ఆరా తీశారు. హత్య జరిగిన ఇంటి దగ్గర క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు. అదేవిధంగా డాగ్ స్క్వాడ్ హత్య జరిగిన ఇంటి నుంచి ఎగువమారేడుపల్లె చెరువు వరకు వచ్చి కుక్కలు ఆగిపోయాయి. స్థానిక పోలీస్ స్టేషన్‌లో చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి వృద్ధురాలి హత్యకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఎగువమారేడుపల్లెకు చెందిన డి.కృష్ణమనాయుడు, డి.అనసూయమ్మ(75) దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కొడుకులు నాగరత్నం నాయుడు పుణేలో, మురళినాయుడు హైదరాబాద్‌లో, కుమార్తె వరలక్ష్మి చిత్తూరు నగరంలో నివాసం ఉంటోంది. భర్త మరణానంతరం అనసూయమ్మ ఇంటిలో ఒంటరిగా ఉంటోంది. అయితే బుధవారం గుర్తు తెలియని దుండగులు అనసూయమ్మ ఇంట్లో మంచంపై పడుకుని నిద్రిస్తుండగా నోటిలో గుడ్డ కుక్కి కత్తితో గొంతు కోసి హతమార్చారు. ఆమె మెడలోని బంగారు చైను, చేతిలో గాజులు ఎత్తుకెళ్లారు. ఇంటి అల్మారాలో దుస్తులు చిందరవందగా పడిఉన్నాయి. అయితే అల్మారాలో నగదు, బంగారు ఉన్నట్లు అనసూయమ్మ కుమార్తె వరలక్ష్మి ఫిర్యాదు చేసిందన్నారు. డాగ్‌స్క్వాడ్, వేలిముద్రల ఆధారంగా వివిధ కోణాల్లో కేసు విచారణ చేసి, దుండగులను పట్టుకుంటామని స్పష్టం చేశారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలను అరికట్టవచ్చని సూచించారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. మృతురాలు కుమార్తె వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

లేగ దూడల ప్రదర్శన



మాట్లాడుతున్న ఉప సంచాలకుడు బాల సుబ్రమణ్యం

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లెలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం లేగ దూడలను ప్రదర్శించారు. దూడలకు పుట్టినప్పటి నుంచి సరైన పోషకాహారం అందిస్తే మంచి పాడి ఆవులుగా పెరుగుతాయని అధికారులు అవగాహన కల్పించారు. 33 దూడలు ప్రదర్శనలో పాల్గొనగా, ఉత్తమంగా ఎంపిక చేసిన ఐదు దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు బాలసుబ్రమణ్యం, నగిరి, సోమల సహాయ సంచాలకులు వాసు, శ్రీనివాసులు నాయుడు, వైద్యాధికారులు చందనప్రియ, కల్యాణ్‌రామ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గణపతి, జిలాని పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సెబ్ అధికారులు

పలమనేరు: పలమనేరు సెబ్ పరిధిలోని గొర్రెలదొడ్డి క్రాస్ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, 50 టెట్రా ప్యాకెట్లును, బైక్‌ను సీజ్ చేసినట్టు డీటీఎఫ్ చిత్తూరు టీమ్ సీఐ మాధవస్వామి బుధవారం తెలిపారు. నిందితుడు పలమనేరు మండలం జంగాలపల్లెకు చెందిన చిన్నబ్బ(39)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ మస్తాన్‌వళి, సిబ్బంది శ్రీనాథ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు : నలుగురికి గాయాలు

పలమనేరు: పట్టణసమీపంలోని పెద్దచెరువు కట్టపై పలమనేరు– కుప్పం రహదారిలో బుధవారం బైక్‌ను బస్సు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. గంగవరం మండలం గోవిందు శెట్టిపల్లికి చెందిన ఇద్దరు సొంతపనిపై బైక్‌లో పలమనేరుకు బయలుదేరారు. వీరు కట్టపైకొచ్చేసరికి బైక్‌ను తిరుపతి నుంచి కుప్పానికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌లోని గోవిందుశెట్టిపల్లికి చెందిన రాజేంద్ర(28), నవీన్(20), బస్సు ఉన్నట్టుండి బ్రేక్ వేయడంతో బస్సులోని తిరుపతికి చెందిన సుభాషిణి(28), మునెమ్మ(48) గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో సిబ్బంది బాబాజాన్, నగ్మా స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

మామిడి వ్యాపారులకు రూ.51 లక్షల టోకరా

చిత్తూరు అర్బన్: కట్టమంచిలోని వ్యవసాయశాఖ మార్కెట్ యార్డులో మామిడి వ్యాపారం చేస్తున్న పది మంది వ్యాపారులకు శ్రీనగర్‌కు చెందిన ముగ్గురు కుచ్చుటోపీ పెట్టారు. సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు.. కట్టమంచిలోని మామిడికాయల మార్కెట్‌లో నందగోపాల్‌నాయుడు మరో పది మంది వ్యాపారుల నుంచి కశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్‌కు చెందిన ఖుర్షిద్ అహ్మద్, నజీర్ అహ్మద్, హమీద్ అనే ముగ్గురు ట్రేడర్లు గత రెండు నెలలుగా మామిడి కాయలు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన సరుకుకు కొంత మేరకు నగదు చెల్లించి తీసుకెళుతున్నారు. ఈ క్రమంలో 42 లారీల మామిడి కాయలను తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించి రూ.51 లక్షలను చెల్లించలేదు. వ్యాపారులు అడిగితే, ఇప్పుడే చెల్లిస్తానంటూ చెబుతూ సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు.

వినాయకునికి బంగారు విభూది పట్టి బహూకరణ



బంగారు వీభూది పట్టి



ఆలయ ఈఓ వెంకటేశుకు బంగారు విభూది పట్టీని అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారికి కృష్ణా జిల్లా, గుడివాడకు చెందిన వేంకటేశ్వరస్వామి అనే దాత బంగారు విభూది పట్టిని బహూకరించారు. ఉదయం దాత కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఈ సందర్భంగా రూ.4.50 లక్షల విలువైన సుమారు 100 గ్రాముల బంగారు విభూది పట్టిని కాణిపాకం ఆలయ ఈఓ వెంకటేశుకు అందజేశారు. వారికి ఆలయాధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పాల ఉత్పత్తి పెంపు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పాల ఉత్పత్తి పెంపునకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని జేసీ చాంబర్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో పాడిపరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. జగనన్న పాలవెల్లువ పథకం అమలులో 101 ఏఎంసీలు పాల సేకరణ చేస్తున్నాయన్నారు. వి.కోట, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో పాలసేకరణ జరుగుతోందని చెప్పారు. స్వయం సహాయక సంఘ మహిళలు ఆర్థిక సమృద్ధి సాధించేలా ప్రభుత్వం తోడ్పాటునిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. డెయిరీ డెవలప్‌మెంట్ అధికారి రవిచంద్రన్ మాట్లాడుతూ ఈనెల 11న జిల్లాలోని 101 ఏఎంసీ (వి.కోట, రామకుప్పం, శాంతిపురం) మండలాల్లో 11,601 లీటర్ల పాల సేకరణ చేసినట్లు వివరించారు. డీఆర్‌డీఏ పీడీ తులసి మాట్లాడుతూ పాడిపోషణకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని స్త్రీ నిధి పథకం కింద అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ప్రభాకర్, కోఆపరేటివ్ అధికారి బ్రహ్మానందరెడ్డి, అమూల్ జిల్లా కోఆర్డినేటర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.1.50 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): హైదరాబాద్‌కు చెందిన దాతలు గోపరాజు, శ్రీరామమూర్తి, మణికొండ బుధవారం కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి గోసంరక్షణ ట్రస్టుకు రూ.1.50 లక్షల విరాళం ఇచ్చారు. దాతలు కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఆ సందర్భంగా ఆ మొత్తాన్ని ఆలయాధికారులకు అందజేశారు. ఆలయాధికారులు వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య



పుత్తూరు రూరల్: మృతుడి ఎడమ చేతిపై టాటూ

కుప్పంరూరల్: కుప్పం రైల్వేస్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుప్పం హెడ్ కానిస్టేబుల్ నాగరాజు కథనం మేరకు.. కుప్పంమండలం, మోడల్ కాలనీకి చెందిన రవి కుమారుడు కాళీ (30)కి వివాహమై 6 సంవత్సరాలైంది. పిల్లలు లేరు. దీనిపై మనస్తాపానికి గురైన కాళీ ఇంట్లో తరచూ గొడవలు పడేవాడు. ఇదే క్రమంలో బుధవారం ఇంట్లో కలహాలతో మనస్తాపానికి గురయ్యాడు. కుప్పం రైల్వేస్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద బెంగళూరు– చెన్నై ట్రాక్‌పై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టమ్ నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు చెప్పారు.

వడమాలపేట వద్ద గుర్తుతెలియని వ్యక్తి..

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం పూడి రైల్వే స్టేషన్ సమీపంలోని స్వర్ణముఖి బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని రేణిగుంట రైల్వే పోలీసులు బుధవారం మధ్యాహ్నం గుర్తించారు. రైల్వే ఎస్ఐ ఎంపీ అనిల్‌కుమార్ కథనం మేరకు వివరాలు.. మృతుడికి సుమారు 35 ఏళ్ల వయస్సు ఉండవచ్చు. రైల్వే ట్రాక్‌పై మృతదేహం ముక్కలైన తీరును బట్టి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. మృతుడి ఎడమ చేతి మణికట్టుపై హార్ట్ బీట్ టాటూ ఉంది. బ్లూ కలర్ నైట్ ప్యాంట్, లైట్ బ్లూ కలర్ టీ షర్ట్ ధరించి ఉన్నాడు. రేణిగుంట రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

మానవ హక్కులపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఆర్డీఓ సుజన

నగరి : ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని నివాసితులకు మానవహక్కులపై మండలస్థాయి అధికారులు అవగాహన కల్పించాలని ఆర్డీఓ సుజన అన్నారు. బుధవారం కార్యలయంలో డివిజన్ పరిధిలోని మండలాల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెల చివరివారం ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలన్నారు. వారికి ఉన్న హక్కులపై అవగాహన కల్పించాలని తెలిపారు. మూడు నెలలకోసారి డివిజనల్ స్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బిల్లులు సక్రమంగా అందించండి



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ సుబ్రమణ్యం

పాలసముద్రం : ఉపాధిహామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు బిల్లులు సక్రమంగా అందిస్తున్నారా ? అని ఏపీడీ సుబ్రమణ్యం ఆరా తీశారు. బుధవారం ఆయన సింహరాజుపురం పంచాయతీ మఠవలం గ్రామంలో సర్పంచ్ భాస్కర్‌రెడ్డితో కలిసి ఉపాధిహామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు బిల్లులు ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. జాబ్ కార్డు కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ పనులకు వెళ్లాలని తెలిపారు. ఇన్‌చార్జ్ ఏపీఓ అనుషా, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

వెదురుకుప్పం: మండల కేంద్రంలో ఉన్న ఐటీఐ(ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ) 2023–24 సంవత్సరానికి గాను రెండవ విడత ఖాళీగా ఉన్న వివిధ ట్రేడ్‌లలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ భైరవుడు బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆగస్టు 3, 4 తేదీల్లో జరిగే ఇంటర్వ్యూలకు రావాలన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో వివిధ ట్రేడ్లలో ఉన్న ఖాళీలకు రెండవ విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 12 నుంచి ఈ నెల 31వ తేదీ సాయంత్రంలోపు తమ దరఖాస్తులు అందించాలని కోరారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆగస్టు 3వ తేదీ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

తలనీలాల వేలంతో రూ.1.80 లక్షల ఆదాయం

కార్వేటినగరం: స్కంధపుష్కరిణి సమీపంలో కుమారగిరిపై వెలసిన వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన తలనీలాల బహిరంగ వేలంపాట ద్వారా ఆలయానికి రూ.1.80 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయ అధ్యక్షుడు కే.కేశవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ వేలంలో తమిళనాడుకు రాష్ట్రం గుడియాత్తంకు చెందిన శ్రీయోగానందనాయుడు భక్తులు సమర్పించే తలనీలాలను రూ.1.80 లక్షలకు దక్కించుకున్నట్లు చెప్పారు. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వెచ్చించడం జరుగతుందని తెలిపారు.

నింద్ర పోలీస్ స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రవికుమార్

నింద్ర: మండల కేంద్రంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌ను నగరి డీఎస్పీ రవికుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ పరిధిలోని కేసుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు నమోదు వివరాలు, రికార్డులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగరి రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ రవిశంకర్ పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

నగరి : మున్సిపల్ పరిధిలోని కాకవేడులో గంగజాతర బుధవారం వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి ఊరి మధ్యకు ఊరేగింపుగా గంగమ్మను తీసుకురాగా బుధవారం ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో గంగమ్మ ఆలయం వద్ద బారులు తీరారు. వేపాకు సారెలు, అగ్గికుండలు, అంగప్రదక్షిణలు చేస్తూ అంబలి సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారికి బలికూడు సమర్పించి ఊరేగింపుగా పొలిమేర దాటించారు.

రాజకీయ లబ్ధి కోసమే పవన్ వ్యాఖ్యలు



● నా పేరు అమాసయ్య, గుండ్రాజుకుప్పం దళితవాడ, గుండె సంబంధిత వ్యాధితో తిరుపతి రుయాలో చికిత్స పొందుతుంటే అక్కడికే వచ్చి మా వలంటీర్ ప్రశాంత్ పింఛన్ అందించాడు. గతంలో పెన్షన్ కోసం పడిగాపులు కాయాల్సి ఉండేది. ఊర్లో ఉన్న సమయంలో కూడా వేకువజామున తలుపుతట్టి మరీ పెన్షన్ ఇచ్చేవారు. ఇలా సేవచేసే వారి గురించి తప్పుగా మాట్లాడడం పవన్‌కల్యాణ్‌కు తగదు.

● ఈమె పేరు జీజీ, నగరి మండలం ముడిపల్లిలో వలంటీర్‌గా సేవలందిస్తోంది. గత నాలుగేళ్లుగా జగనన్న ప్రభుత్వం అమలు చేసిన ఎన్నో సంక్షేమ పథకాలు లబ్ధిదారుల దరిచేర్చింది. తెల్లవారకముందే ఇంటివద్దకు వెళ్లి పింఛన్లు అందిస్తోంది. తనకు కేటాయించిన ఇళ్లలోని వారితో కుటుంబంలో ఒక వ్యక్తిగా కలిసిపోయింది. గతంలో కరోనా మహమ్మారి సమయంలోనూ ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేసి వృద్ధుల దీవెనలు పొందింది.





వెదురుకుప్పంలో వలంటీర్ల నిరసన ర్యాలీ



కార్వేటినగరంలో పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను చెప్పకాలుతో తన్నుతున్న మహిళా వలంటీరు

- కరోనా సమయంలో విస్తృతంగా సేవలు అందించాం
- రాజకీయ లబ్ధి కోసమే పవన్ మాపై తీవ్ర ఆరోపణలు
- జీడీనెల్లూరు నియోజకవర్గవ్యాప్తంగా భగ్గుమన్న వలంటీర్లు

కార్వేటినగరం/నగరి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేదంటే తమ చెప్పులకు పనిచెప్పాలా ? అంటూ వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 6 మండలాల్లో వలంటీర్లు ఆగ్రహంతో రగిలిపోయారు. నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లపై రాజకీయ లబ్ధి కోసం ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వలంటీర్ల కన్వీనర్ల ఆధ్వర్యంలో వలంటీర్లు ఆయా మండల కేంద్రాల్లో నిరసనలు, ర్యాలీలు చేపట్టారు. పవన్‌కల్యాణ్ డౌన్‌డౌన్ అంటూ నినదించారు. నోటిని అదుపులో పెట్టుకుంటావా లేదా మా కాళ్ల చెప్పులకు పని పెట్టమంటావా ..! అని హెచ్చరించారు. ఈ సందర్భంగా మహిళా వలంటీర్లు పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మలకు చెప్పులమాలలు వేసి ర్యాలీగా వెళ్లి మండల కార్యాలయ ఆవరణం నుంచి గాంధ్లమిట్ట కూడలి వరకు వచ్చిన మహిళా వలంటీర్లు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

ఓర్వలేక అసత్య ఆరోపణలు..

అనంతరం వలంటీర్లు మాట్లాడుతూ గతంలో టీడీపీ జన్మభూమి కమిటీలు పెట్టి ప్రజలను నిలువునా మోసం చేసినప్పుడు ఈ పవన్ ఎక్కడికి వెళ్లాడని ప్రశ్నించారు. సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక రాజకీయ లబ్ధి కోసమే ఇలా అసత్య ఆరోపణలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచాన్ని వణికించిన మహమ్మారి కరోనా సమయంలో కూడా ధైర్యంగా ప్రజలకు తాము సేవలందించామని తెలిపారు. అలాగే గంగాధరనెల్లూరులో పవన్‌కల్యాణ్‌ను దిశ చట్టం కింద అరెస్టు చేయాలని ఎస్ఐ రామాంజనేయులుకు ఫిర్యాదు చేశారు.



పవన్‌కల్యాణ్‌పై కేసునమోదు చేయాలని ఫిర్యాదు చేస్తున్న మహిళా వలంటీర్లు



పాలసముద్రంలో పవన్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న వలంటీర్లు

సేవకులు.. వలంటీర్లు



ప్రభుత్వానికి ప్రజల మధ్య వారధుల్లా వలంటీర్లు పని చేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను మాకు సకాలంలో తెలియజేస్తున్నారు. అలాగే అవి మాకు అందేలా చూస్తున్నారు. వారి సేవలు మరువలేనివి. పవన్‌కల్యాణ్ ఆంబోతులా రంకెలేస్తూ, వలంటీర్ల వ్యవస్థను కించపరుస్తున్నాడు. కరోనా వలంటీర్లు చాలా సహాయం చేశారు. అప్పుడు ఈ పవన్ కల్యాణ్ ఎక్కడికి వెళ్లాడు. ఒకరోజు ప్రజల వద్దకు వచ్చారా ? కానీ వలంటీర్లు నిత్యం ప్రజల వద్దకు వచ్చి సాయం అందించారు.

– చిన్నబ్బ, ఎంఎం విలాసం, కార్వేటినగరం



పెనుమూరులో పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను తగుల బెడుతున్న వలంటీర్లు



గంగాధరనెల్లూరులో పవన్ దిష్టిబొమ్మను తగలబెడుతున్న వలంటీర్లు

సిమెంటు రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్



సిమెంట్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి

నగరి : మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్ పరిధిలోని రామ్‌నగర్ ఏ, బీలలో గడపగడపకు నిధులు రూ.10 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి భూమిపూజ చేశారు. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో వార్డులో నిర్వహించే సమయంలో స్థానికులు రోడ్డు, డ్రైనేజీ సమస్యను మంత్రి ఆర్కే రోజా దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆమె రూ.10 లక్షలు రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. బుధవారం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు భారతి, బిలాల్, మున్సిపల్ సచివాయాల కన్వీనర్ దయానిధి, కోఆప్షన్ సభ్యులు బిలాల్, ఎల్లప్పరెడ్డి, నాయకులు జైలాబ్దీన్, రమేష్‌రెడ్డి, సలీం తదితరులు పాల్గొన్నారు.

నగరి పట్టణంలో..

మున్సిపల్ పరిధి కీళపట్టులో గడప గడపకు నిధులు రూ.4.5 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డును నిర్మిస్తున్నారు. ఎంతోకాలంగా ఉన్న రోడ్డు సమస్య ప్రస్తుతం రోడ్డు నిర్మాణంతో పరిష్కృతం అవుతోంది. నిర్మాణ పనులను బుధవారం కమిషనర్ వెంకట్రామిరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ నరేష్, నాయకులు చంద్రారెడ్డి, యాకోబు, రాజముత్తు, ఏఈ నవీన్ పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: పుత్తూరు మున్సిపాలిటీ 14వ వార్డు ఎన్జీఓ కాలనీ గుట్టపై నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.5 లక్షల అంచనా వ్యయంతో 110 మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపం లేకుండా జాగ్రత్తలు వహించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్, ఏఈఈ కార్మికేయన్, కాంట్రాక్టర్ భరత్ పాల్గొన్నారు.

కళ్లు ఉన్న కబోదులు టీడీపీ నాయకులు



ఎంఎస్‌వీఎంపురం వద్ద నిర్మిస్తున్న టెక్స్‌టైల్స్ కంపెనీ



డాక్టర్ కృష్ణమరాజు

పుత్తూరు రూరల్: నగరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు పరుగులు పెడుతున్నా, ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, మంత్రి ఆర్కే రోజాకు జేజేలు పలుకుతున్నా టీడీపీ నాయకులకు కనబడడం లేదూ, వినబడడం లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఎస్.కృష్ణమరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 27వ వార్డు టీడీపీ కౌన్సిలర్ బసంతికి మంత్రి రోజమ్మను విమర్శించే స్థాయి ఏమాత్రం లేదన్నారు. నోరు ఉంది కదా అని అవాకులు, చవాకులు పేలితే తగిన రీతిలో బుద్ధి చప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. నింద్ర మండలం ఎంఎస్‌వీఎం పురం గ్రామంలో అమ్మయప్పర్ టెక్స్‌టైల్స్ కంపెనీ నిర్మాణానికి 6 నెలల కిందటే మంత్రి రోజా భూమిపూజ చేసిన విషయం తెలియదా అని ప్రశ్నించారు. దుస్తులు తయారు చేసి ఎగుమతి చేసేందుకు గానూ ఈ కంపెనీనీ సుమారు 100 ఎకరాల్లో నిర్మిస్తున్నారని తెలిపారు. నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. ఫ్యాక్టరీ ప్రారంభమైతే 3 వేలమందికి ఉద్యోగాలు వస్తాయని వివరించారు. ఇవేవీ తెలుసుకోకుండా మంత్రిని విమర్శించడం తగని పని అన్నారు.

టీడీపీ ఖాళీ కావడంతోనే వదంతులు



టీడీపీ సభ్యత్వ కార్డులు చూపిస్తున్న నాయకులు

వెదురుకుప్పం: మండలంలో టీడీపీ ఖాళీ అయిందన్న అక్కసుతోనే కొందరు టీడీపీ చోటా నాయకులు వదంతులు సృష్టిస్తున్నారని మాజీ ఎంపీపీ జ్ఞానకొండారెడ్డి అన్నారు. సోమవారం వెదురుకుప్పంలో జరిగిన వైఎస్సార్‌సీపీ బహిరంగ సభలో టీడీపీ నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. అయితే టీడీపీ అనుకూల మీడియాలో వైఎస్సార్‌సీపీలో చేరిన వాళ్లకు టీడీపీలో సభ్యత్వం లేదని ఆరోపించారు. బుధవారం పార్టీలో చేరిన నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి టీడీపీలో వారి సభ్యత్వ కార్డులను చూపించి, ఇలాంటి దిక్కుమాలిన విమర్శలు చేయవద్దంటూ నినదించారు. మండలకేంద్రంలో టీడీపీకి ఉనికి లేకుండా పోయిందన్న ఉద్దేశంతోనే ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేస్తున్న పాలనను మెచ్చి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మండల అభివృద్ధికి చేస్తున్న కృషితోనే పార్టీలో చేరామని స్పష్టం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి గడిచిన నాలుగేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులకు బీజం వేసినట్లు తెలియజేశారు. టీడీపీ విధానాలు నచ్చకనే పార్టీ వీడినట్లు తెలిపారు. ఇంకోసారి తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేస్తే తగిన రీతిలో సమాధానం ఇస్తామని హెచ్చరించారు. శేఖర్‌రెడ్డి, రమేష్, దేవరాజులు, కృష్ణయ్య, వెంకటేష్, సురేష్, చంద్రబాబు, వినాయక, గణేష్, మోహన్ పాల్గొన్నారు.

స్కూల్ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లత అన్నారు. బుధవారం ఒంటిలవారిపల్లి ప్రాథమిక పాఠశాలను రూ.24 లక్షల నిధులతో మనబడి నాడు–నేడు పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని కోట్లు వెచ్చించి ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. గత టీడీపీ హయాంలో ప్రభుత్వ స్కూళ్లను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పలు పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. అనంతరం భూమిపూజ నిర్వహించారు. ఎంపీపీ లత, బాలాజీ దంపతులను ఎంఈఓ ఎం.విజయకుమార్ పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ శీలారాణి, ఎంపీటీసీ విమల, ఏఈ నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు

- 529 మందికి ఉచితంగా సర్టిఫికెట్లు, ఆధార్ సేవలు
- మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి



నగరి : సర్టిఫికెట్లు అందుకున్న వారితో రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి : అర్హులందరికీ ప్రభుత్వ సేవలు చేరువ చేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. నగరి మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్ సచివాలయ పరిధిలో 11, 12 వార్డుల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్హులైన 215 మందికి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 223 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆర్వోఆర్ 1బీ ఒకరికి, పెన్షన్లు ఇద్దరికి, ఓబీసీ సర్టిఫికెట్ ఒకరికి, ఇంటి నివేశనం ఒకరికి, అదనపు సభ్యులు చేర్చిన రేషన్‌కార్డు ఒకరికి, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్లు ముగ్గురికి, ఆధార్ లింకింగ్ 82 మందికి అంటూ 529 మందికి ఉచితంగా అందించారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు భారతి, బిలాల్, మున్సిపల్ సచివాయాల కన్వీనర్ దయానిధి, కోఆప్షన్ సభ్యులు బిలాల్, ఎల్లప్పరెడ్డి, నాయకులు జైలాబ్దీన్, రమేష్‌రెడ్డి, సలీం, మున్సిపల్ డీఈ నరేష్, మెప్మా అధికారి సునీత పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం (నగరి) : మండలంలోని కాళికాపురం సచివాలయ ఆవరణలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు జగనన్న సురక్ష కార్యక్రమంలో అక్కడికక్కడే 58 మందికి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 84 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ముగ్గురికి ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్లు, 30 మందికి ఆధార్‌కార్డు అప్‌డేషన్, 10 మందికి ఆధార్ కార్డు అందించారు. వైస్ ఎంపీపీ బాలాజీ, సింగిల్ విండో అధ్యక్షుడు హరినాయుడు, ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ వెంకట్రాయులు, ఏఓ రజినికుమారి, సర్పంచ్ కుముద పాల్గొన్నారు.

వలంటీర్ల మనోభావాలు దెబ్బతీస్తున్న పవన్

పుత్తూరు రూరల్: జగనన్న సురక్ష పథకం వలంటీర్ల పనితీరుకు వారి చిత్తశుద్ధికి అద్దం పడుతోందని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా పనిచేస్తున్న వలంటీర్లను పవన్‌కల్యాణ్ దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ మాట్లాడడం అతని రాజకీయ దివాళా కోరుతనానికి నిదర్శనమన్నారు. బుధవారం పుత్తూరు పట్టణ పరిధిలోని సత్యనారాయణ కాలనీ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ వలంటీర్ల మనోభావాలను దెబ్బతీసిన పవన్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సత్యనారాయణ సచివాలయ పరిధిలో 538 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, సచివాలయ కన్వీనర్ ఏకాంబరం, కౌన్సిలర్ రాజేశ్వరి, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, టీపీఓ మూర్తి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పథకాలు అందరికీ అందాలన్నదే లక్ష్యం

వెదురుకుప్పం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలన్నదే జగనన్న సురక్ష ప్రధాన ఉద్దేశమని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మాంబేడు, తిరుమలయ్యపల్లె గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ నాగరాణి, ఎంపీడీఓ సుధాకరరావు, తహసీల్దార్ పుల్లారెడ్డి, డీటీ కోమల, ఈఓపీఆర్డీ పురుషోత్తం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): మండలంలోని మహదేవమంగళం, నెల్లేపల్లిలో ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్నునాథన్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్ వేలు మొదలియార్, సర్పంచ్ జయచంద్రారెడ్డి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. నెల్లేపల్లి సర్పంచ్ నరేంద్రనాథరెడ్డి, వైస్ ఎంపీపీ బేబి పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులతో చైర్మన్ హరి



వెదురుకుప్పంలో..

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పుత్తూరులో పౌష్టికాహారం తీసుకుంటున్న గర్భిణులు

పుత్తూరు రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. పరీక్షల నిమిత్తం వేచి ఉండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు యథావిధిగా వెజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, పచ్చడి, సాంబారు, రసం , పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు కృష్ణకాంత్, ప్రకాష్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్స్ నారాయణస్వామి, పుష్ప, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలే శిశువుకు శ్రేయస్కరం

పాలసముద్రం : తల్లిపాలే శిశువుకు శ్రేయస్కరమని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భిణులతో డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ జన్మించిన శిశువుకు 6 నెలల వరకు కేవలం తల్లిపాలే పట్టాలన్నారు. ఆరు నెలలకు పైగా తృణధాన్యాలు, కిచిడీ, పొంగల్, పప్పులు, పండ్లు పెట్టాలని సూచించారు. క్రమక్రమంగా పిల్లలు తినే ఆహారం మోతాదును పెంచుకోవాలని తెలిపారు.

న్యాక్ బృందం పర్యటన



కళాశాల అభివృద్ధిపై కమిటీ సభ్యులతో చర్చిస్తున్న న్యాక్ బృందం

కార్వేటినగరం: మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్(న్యాక్) బృందం సందర్శించింది. రెండు రోజులు పాటు కళాశాలలో తనిఖీల్లో భాగంగా రాయపూర్‌లోని రవిశంకర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శివపుత్ర పరగుండి, భీవండీ బీఎన్ఎన్ కళాశాల ప్రొఫెసర్ అశోక్‌దామోదర్ వేఘా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో పలు విభాగాలను సందర్శించారు. అనంతరం కళాశాలలో అమలవుతున్న విద్యావిషయాలపై కళాశాల పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బుధవారం కూడా న్యాక్ బృందం పర్యటన ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ విజయులురెడ్డి తెలిపారు. కార్యాలయంలో ఆటోమేషన్ సిస్టం ద్వారా టీసీ ఇవ్వడం, స్మార్ట్‌బోర్డు బోధనలు, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యాలపై పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. న్యాక్‌బృందంతో పాటు కడప ఆర్జేడీ బాబు, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బాలాజీ, ఎంపీపీ లత, సర్పంచ్ ధనుంజయవర్మ అధ్యాపకులు పాల్గొన్నారు.